

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,17 మే 2025 | 8 పేజీలు


# లంచం కేసులో బెయిల్..

## అక్రమార్జన కేసులో మర్నాడే కాకినాడ రిజిస్ట్రార్ అరెస్ట్

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ చర్యలు
- లక్ష రూపాయల లంచం కేసులో మార్చిలో అరెస్ట్
- బెయిల్‌పై విడుదలైన మర్నాడే మళ్లీ అరదండాలు
- ఆంధ్ర, తెలంగాణలోని ఇళ్లలో ఏసీబీ దాడులు
- రాజమహేంద్రవరం జైలుకు తరలింపు






**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** లంచం తీసుకుంటూ ఇప్పటికే ఒకసారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కి సస్పెన్షన్‌కు గురైన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె. ఆనందరావు మెడకు మరో ఉచ్చు బిగిసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు ఆయన్ను నిన్న (గురువారం) మళ్లీ అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

**వివరాల్లోకి వెళితే..** తునికి చెందిన ఓ వ్యక్తి నుంచి గ్యాస్ ఏజెన్సీ లైసెన్స్ పేరు మార్పిడి చేసేందుకు రూ.లక్ష లంచం తీసుకున్నారన్న ఆరోపణలపై ఈ ఏడాది మార్చి 28న ఆనందరావును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆకేసు రిమాండ్‌లో భాగంగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న ఆయన ఈ నెల 14న బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే,లంచంకేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆనందరావు అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడతో పాటు తెలంగాణలోని నిజామాబాద్, బోధన్, హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతాల్లో ఉన్న ఆనందరావు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాలపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లభించిన ఆధారాలమేరకు గురువారం ఆనందరావును ఏసీబీ అధికారులు మళ్లీ అరెస్టుచేసి రాజమహేంద్రవరం ఏసీబీకోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు

- తరువాయి 2లో..



## దేశం కోసం సైన్యం ..
# సైన్యం కోసం మనం

- తిరంగా యాత్రను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** పహల్గామ్ ఉగ్రవాదుల దాడికి ప్రతిచర్యగా "ఆపరేషన్ సింధూర్" చేపట్టి ప్రపంచానికి మన సైనిక శక్తి సామర్థ్యాన్ని తెలియచేశామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో తిరంగ యాత్ర–దేశభక్తులర్యాలీ నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఆపరేషన్ సింధూర్ దేశ ప్రజలందరికీ గర్వకారణమైన విజయమని, దేశ భద్రతను కాపాడేందుకు త్రివిధ దళాల సంకల్పాన్ని ఈ ఆపరేషన్ పునరుద్ఘాటించిందన్నారు. ఈ అఖండ విజయానికి మనమంతా సాయుధ దళాలకు సమిష్టిగా కృతజ్ఞతాభినందనలు తెలియచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో అఖండ విజయం సాధించిన నేపథ్యంలో దేశ సాయుధ దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాలను గౌరవించడానికి తిరంగ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు.. ఈతిరంగ యాత్ర శనివారం సాయంత్రం 4.00 గంటలకు పుష్కరాల రేవు నుంచి కోటగుమ్మం మెయిన్ రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకు

- తరువాయి 2లో..

## కూటమి ప్రభుత్వ పాలనపై
# ప్రజలు తీవ్ర అసంతృప్తి

- మాజీమంత్రి బొత్స



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితోఉన్నారని వైసీపీ పక్ష శాసనమండలి ప్రతిపక్ష నేత,మాజీమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఉభయగోదావరి జిల్లాల వైసీపీ పార్టీ సమన్వయసమీక్షా సమావేశం శుక్రవారం కాకినాడలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలను గత వైసీపీ ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం 5జిల్లాలుగా విభజించడం జరిగిందన్నారు. 5జిల్లాల పార్టీ బాధ్యులు, ముఖ్యులతో సమావేశం జరిగిందన్నారు. గ్రామ, మండల,డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామని, జూన్ 1నుండి 10 వరకూ సమీక్షసమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాబోయే 50రోజుల్లో పార్టీసంస్థాగత సమావేశాలు జరపాలని ,గత ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ప్రజాసమస్యలపై నిరసనలు, వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. స్థానిక నాయకత్వాల ఆధ్వర్యంలో రైతాంగానికి అండగా నిరసనలు చేపడతామని అన్నారు. ఆక్వారంగ సమస్యలపై పోరాటాలుచేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ క్షేత్రస్థాయిలో

- తరువాయి 2లో..

## ఆకస్మిక విపత్తులపై మాక్ డ్రిల్
# కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహణ

- మాక్ డ్రిల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని కన్నులకు కట్టినట్లుగా చూపించిన సంబంధిత అధికారులు





**కాకినాడ,మేజర్‌న్యూస్:** మాక్‌డ్రిల్స్ ద్వారా భవిష్యత్‌లో జరిగే నష్టాన్ని అరికట్టవచ్చునని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతెలిపారు. ప్రకృతి వైపరిత్యాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తంచేసి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్స్ ఉపయోగపడుతుందని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖలు మాక్ డ్రిల్స్ నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల

- తరువాయి 2లో..

## ఆకస్మిక విపత్తులపై మాక్ డ్రిల్

# కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహణ

మొదటిపేజి తరువాయి

నిర్వహణ సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ మాక్ డ్రిల్ నిర్వహణ వల్ల ప్రజల భద్రత, సన్నద్ధతను గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. విపత్తు సమయంలో తీసుకోవల్సిన చర్యల గురించిఅవగాహన కల్పించి తద్వారా ప్రజలుగందర గోళానికి గురికాకుండా త్వరగా స్పందించగలరన్నారు. మాక్‌డ్రిల్ సమయంలో సురక్షిత ప్రాంతాలకు చేరడం,స్వీయరక్షణకు టెక్నికల్ ను నేర్చుకోవచ్చన్నారు. ఈడ్రిల్స్ ద్వారా అత్యవసర సేవలైన అగ్నిమాపకదళం, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసులు, వైద్య బృందాల సమన్వయాన్ని మెరుగుపరుస్తాయ న్నారు.ఇది వాస్తవ సంఘటనలో సమర్ధవంతమైన రక్షణ చర్యలకు దోహద పడుతుందన్నారు. మాక్ డ్రిల్స్ ద్వారాభవిష్యత్‌లో జరిగేనష్టాన్ని అరికట్టవచ్చు నని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు.

**మాక్ డ్రిల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని కన్నులకు కట్టినట్లుగా చూపించిన సంబంధిత అధికారులు..**కాకినాడ కలెక్టరేట్ లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని కన్నులకు కట్టినట్లుగా సంబంధిత అధికారులు చూపించారు. అగ్నిమాపక సేవలు, ఎస్డిఆర్‌ఎఫ్, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ, శిక్షణ పొందిన సిబ్బంది, విద్యుత్ శాఖ, తదితర బహుళ విభాగాలు మాక్ డ్రిల్స్‌లో పాల్గొన్నాయి. కలెక్టర్ కార్యాలయంలో సంభవించిన అగ్ని ప్రమాదం ద్వారా ప్రజలను ఏ విధంగా రక్షించాలో కళ్లకు కట్టినట్లు అగ్నిమాపక సిబ్బంది ఎస్డిఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షణ భద్రత కలిగివుండి ప్రమాద ప్రాంతం నుండి వ్యక్తులను రక్షించారు. సహాయక చర్యల్లో మెట్లు, నిచ్చెనలు ద్వారా గాయపడినవారిని తీసుకువచ్చి తాత్కాలిక వైద్య శిబిరంలో ప్రధమ చికిత్స అందించి వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా అగ్నిమాపకశాఖ ద్వారా వైరు సంభవించినప్పుడు తీసుకోవలసిన సూచనలను తెలియజేసి ప్రజలు ఏ విధంగా బయటపడాలో వారు సూచించారు. అగ్ని ప్రమాద పరిసరాల్లో చిక్కుకున్న వారిని నిచ్చెనల ద్వారా కిందకు తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిపిఆర్, అత్యవసర వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ పై అంతస్థులో అగ్నిప్రమాదం సంభవించినట్లు క్రియేట్ చేసి మొదలు నిచ్చెన ఆసరాగా భవనంపైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్నా వారిని క్రిందికి తీసుకువచ్చి తక్షణం వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాలు ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ చేశారు. ఈ కార్యక్రమాలను అన్నింటిని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా స్వయంగా పర్యవేక్షించారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో కొంత భాగం కూలిపోయినట్లు క్రియేట్ చేసి అందులో చిక్కుకున్నవారిని ఏ విధంగా కపాడాలో మాక్ డ్రిల్ ద్వారా కళ్ళకు కట్టినట్లు వివరించారు. భవనం కూలిపోయిన తరువాత అందులో ఎంతమంది చిక్కుకున్నారో కనుక్కునేందుకు కెమెరాలను వినియోగించి, అందులో చిక్కుకున్నవారిని శబ్దాల ద్వారా గ్రహించి, వారిని రక్షించేందుకు గోడను కట్టర్ల ద్వారా కట్ చేసి దాని ద్వారా భవనంలోకి ప్రవేశించి, అందులో ఉన్నవారిని స్ట్రక్చర్ ద్వారా బయటకు తరలించి, వారు అపస్మారక స్థితిలో ఉన్న వారిని సిపిఆర్ చేసి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించడం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు ఎస్డిఆర్‌ఎఫ్ టీం ఏ విధంగా సేఫ్టీ దుస్తులు, సేఫ్టీ ఎక్విప్మెంట్, సూచనలు తీసుకొని నియమ నిబంధనల ప్రకారం ఈ మాక్‌డ్రిల్లు ఆశాంతం ఆకట్టుకునే విధంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకట్రావు, 3వ బెటాలియన్ ఎస్‌డిఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ఎం.మోహన్ రావు, జిల్లా ఫైర్ ఆఫీసరు పి.వీ.ఎస్.రాజేష్, డిఈఓసి నోడల్ అధికారి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఏఎస్డిసి డి.భారతి, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి డి.నాగార్జున, డిపిఓ రవికుమార్, కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ రావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టణంలో స్వచ్ఛత దివస్

**నర్సాపురం,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశములను అనుసరించి స్వచ్ఛత దివస్ సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. మే నెల థీమ్ బీట్ ద హార్ట్ కార్యక్రమంలో భాగంగా ఉదయం గం.9.30 లకు స్థానిక బస్ స్టాండ్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి మెయిన్ రోడ్డు/ప్రకాశం రోడ్డు మీదుగా శివాలయం సెంటర్ లోని గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు. స్థానిక శాసన సభ్యులుప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకట రమణల ఆధ్వర్యంలో మే నెలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తారు అన్నారు.

# కాలువలు,డ్రైన్లు ప్రక్షాళనకు చర్యలు





### - ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ ఆదేశాలు

**కైకలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు చేపట్టిన కాల్వలు,డ్రైన్ల ప్రక్షాళన లో భాగంగా ఇటీవల అన్ని డ్రైన్ లలో కిక్కిస తొలగిస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ఏ ఒక్క డ్రైన్ వల్ల కూడా పొలాలు గానీ,రోడ్లు గానీ,చేపల చెరువులు ముంపుకు గురి అయ్యే పరిస్థితి తలెత్తకూడదన నినిర్దిష్టమైన ప్రణాళికతో ఆదేశాలు జారీచేశారు.స్థానిక ప్రజా ప్రతినిధులు, నీటి సంఘం ప్రతినిధులు, పనుల కమిటీ సభ్యులు యొక్క సమన్వయం తో స్థానిక అధికారులు సహకారంతో పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయ న్నారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఈ డ్రైన్ల ప్రక్షాళన పనులు అనుభవఘ్నులు, నీటి వనరుల నిర్వహణ మీద పూర్తి అవగాహన ఉన్నశాసనసభ్యులు కామినేని వల్లే సాధ్యమవుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈకాల్వలు, డ్రైన్ల మీద పూర్తి నిర్లక్ష్య ధోరణి అవలంబించుట వలననీటి ప్రవాహం లేక కిక్కసా, గుర్రపుడెక్క విపరీతంగా పెరిగి లోతట్టు గ్రామాలు ముంపుకు గురయ్యేవనితెలిపారు.ఎమ్మెల్యే ముందుచూపుతో, నియోజకవర్గ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు పంటులను సొంత నిధులతో తయారు చేయించారు. నియోజకవర్గంలో ప్రముఖంగా పుల్లవ డ్రైన్, పేద కొమ్మిలేరు డ్రైన్, పెదలంక డ్రైన్, చిన్న కొమ్మిలేరు డ్రైన్, దమ్మిడి డ్రైన్, కైకలూరు స్వాంప్ డ్రైన్, లాల్వా డ్రైన్ పనులు, పోల్రాజ్ కాల్వ, క్యాంపుబెల్ కాల్వ, కైకలూరు కాల్వలపై నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయి ,ఈ వేసవి కాలంలోనే అన్ని మరమత్తులు పూర్తి చేస్తారు. పెదకొమ్మిలేరు డ్రైన్ మీద సున్నంపూడి గ్రామం వద్ద పంటు మీద 200 మెషీన్‌తో జరుగుతున్న కిక్కిస తొలగింపు పనులు చూసి రైతులు హర్షాతిరేకాలు తెలిపారు.

# లంచం కేసులో బెయిల్..

మొదటిపేజి తరువాయి

రిమాండ్ విధించడంతో తిరిగి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన కె.ఆనందరావు 1995లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో స్టెనోగ్రాఫర్ గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2001లో సబ్-రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొంది పలు ప్రాంతాల్లో సేవలందించారు. 2016 నుంచి జిల్లా రిజిస్ట్రార్ హోదాలో విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరంలలో పనిచేశారు.కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గావిధులునిర్వహిస్తున్న సమయం లోనే ఆయనపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టి అరెస్టు చేశారు.

## దేశం కోసం సైన్యం ..

# సైన్యం కోసం మనం

మొదటిపేజి తరువాయి

సాగుతుందని చెప్పారు. రాజకీయ పార్టీల జెండాలు లేకుండా సుమారు 5వేల జాతీయ పతాకాలతో ఈ ర్యాలీ నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. మన సైనికులకు, దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా తిరంగా యాత్ర నిర్వహించి భారత్ సైన్యంతో మేము ఉన్నామనే సంకేతం ఇచ్చేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశమంతా మీ వెంటే ఉంది అంటూ మన త్రివిధ దళాల కు మద్దతు గా .. మన జాతీయ జెండాను చేతబూని చేసే ఈ ర్యాలీ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.

# కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి

మొదటిపేజి తరువాయి

ప్రజాసమస్యలపై పోరాటంచేయాలనిసూచించారన్నారు. రైతాంగానికి అండగా ఉంటామని అన్నారు.ఈ ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం పూర్తవుతున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. బియ్యం అక్రమ రవాణా అడ్డుకోలేక పోయారన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పనులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. ప్రజలు 40 శాతం ఓట్లు వైసీపీకి వేశారని, ప్రజలే వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీమంత్రి తోట నరసింహం, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎంపీ వంగా గీత, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీమంత్రి పినిపే విశ్వరూప్, మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జ్యోతుల చంటిబాబు, ఎమ్మెల్సీ అనంతబాబు, దాడిశెట్టి రాజా, మార్గాని భరత్, పొన్నాడ సతీష్, కురసాల కన్నబాబు, చింతా అనూరాధ, రౌతు సూర్యప్రకాశ రావు, పందుల రవీంద్ర బాబు, జక్కంపూడి రాజా, ముదునూరి ప్రసాదరాజు, మేడపాటి షర్మిల,పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ వంక రవీంద్ర, గాదం శ్రీదేవి,పిల్లి సూర్యప్రకాష్, కారుమూరి నాగేశ్వరరావు, సుంకర శివప్రసన్న, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

# 17,18 తేదీల్లో కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

ఏలూరు,మేజర్‌న్యూస్ : పెదవేగి మండలం,పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి కూచింపూడి సబ్ స్టేషను పరిధిలో ఆర్‌డిఎస్‌ఎస్ పథకం పనుల నిమిత్తం ఈ నెల 17,18 తేదీలలో శనివారం ,ఆదివారంలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఏలూరు ఈఈ కే.ఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల కూచింపూడి సబ్‌స్టేషన్‌పరిధిలో ఉన్న పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయంఏర్పడునని,కావున వినియోగదారులు గమనించి సహకరించవల సినదిగా ఆయన కోరారు.

# మధ్వసభ ఖ్యాతిని పెంచిన "రాచూరి"

**(రాచూరి రాఘవేంద్ర స్వామి ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)**



రాచూరి రాఘవేంద్ర స్వామి కారణజన్ముడిగా ప్రతి ఒక్కరూ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. ఆధ్యాత్మిక పరంగా ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు అద్భుత ఫలితాలను సమాజానికి ఇచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. అనేకమంది పీఠాధిపతులు, సుధా పండితులు , అర్చక వృత్తిలో కొనసాగుతున్న ప్రముఖులు మరియు ఆచార్య స్థానంలో ఉన్న వారు సైతం రాచూరి రాఘవేంద్ర స్వామిని అభిమానించడం అంటే పూర్వజన్మ సుకృతంగా ప్రస్తావించవచ్చును. ప్రతి ఒక్కరిని గౌరవించడం ఆయనలోనే వ్యక్తిత్వానికి నిదర్శనం. మంచి కార్యదక్షత కలిగిన వ్యక్తిగా ప్రతి ఒక్కరూ కీర్తించడం అరుదైన విషయం. ఆయన లేని లోటు ఎవ్వరూ తీర్చలేరని నేటికీ భావించుకోవడం ఆయన చేసిన సేవలకు నిదర్శనం. సుమారు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన కాకినాడ మధ్వ సభ గౌరవాన్ని పెంచడంలో కీర్తిశేషులు రాచూరి రాఘవేంద్ర స్వామి పుష్కరకాల కృషి స్వర్ణ యుగంగా ప్రస్తావించవచ్చును. మధ్వసభ స్థాపించన ఆశయాలను తెలుసుకొని వాటిని తిరిగి ఆచరించడానికి ఎంతో కృషిచేసిన గొప్ప ఆధ్యాత్మిక చింతనాపరులు. అతి చిన్న వయసులో రాచూరి మద్వసభ కు జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి ప్రయత్నమే కాకినాడలో ఆధ్యాత్మిక చరిత్ర తిరగ రాసిన ఘటన చోటుచేసుకుంది .శ్రీ ఉత్తరాది మఠాధిపతులు 1008 శ్రీ శ్రీశ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ నీ కాకినాడకు కమిటీ సభ్యులతో కలసి ఆహ్వానం చేసి వారం రోజులపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడంలో రాచూరి చూపించిన ప్రత్యేక శ్రద్ధ తో మొత్తం కాకినాడ పేరు దశ దిశల మారిపోయిందనములో సందేహం లేదు. కమిటీ కార్యదర్శిగా కోపెల్ల శేషగిరిరావు జోడి కొత్త ఆధ్యాత్మిక చరిత్రను శ్రీకారం చుట్టింది .ఆనాడు ప్రారంభమైన మధ్వసభ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరియు సుధా పండితుల ప్రవచనాలు కాకినాడ మధ్వ గృహస్థులలో పరివర్తన తీసుకువచ్చి నిత్యము సంధ్యావందనము మరియు దేవతార్చన క్రమం తప్పకుండా నిర్వహిస్తూ గురువులకు సైతం అభిమానం కలిగించే విధంగా జరిగింది. శతాబ్దాల చరిత్ర కలిగిన చొల్లంగి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మధ్వ గురువుల మృతిక బృందావనాలు కలిగి ఉండటం కాకినాడ మధ్వ గృహస్తులకు గొప్ప వరం. శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆదేశానుసారం క్రమం తప్పకుండా మధ్వ గురువుల ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తూ వారి అనుగ్రహం తో పాటు గురువుల ఆశీర్వాదాన్ని కాకినాడ ప్రజలకు అందించడంలో రాచూరి చూపించిన శ్రద్ధ ఎన్నటికీ మరువలేనిది .కాకినాడ ఆధ్యాత్మిక ప్రపంచానికి రాజు లాగా వ్యవహరిస్తూ ఎవరికీ ఏమి కష్టం వచ్చినా తాను ఉన్నానంటూ ధైర్యం చెబుతూ ప్రోత్సహించిన ఏకైక వ్యక్తి రాచూరి.రాచూరి రాఘవేంద్ర స్వామి ఏ నిర్ణయం తీసుకున్న కార్యదర్శి శేషగిరిరావుతోపాటు కమిటీ మొత్తం ఆమోదించడం మరియు ఆచరణలోకి తీసుకురావడానికి కలిసికట్టుగా కృషి చేయడం వంటి సంఘటనలు ఎవరు ఎప్పటికీ మరువలేనిది. శ్రీ సత్యాత్మ తీర్థ స్వామి నిర్వహించే చాతుర్మాస్య దీక్ష కార్యక్రమంలో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఆయన పాల్గొనడమే కాక ఈ ప్రాంత మధ్వ గృహస్తులను తీసుకువెళుతూ అందరికీ గురువుల అనుగ్రహాన్ని ఇప్పించిన ధన్యజీవి రాచూరి.రాచూరి రాఘవేంద్ర స్వామి కి కుడి భుజంగా ఆమె ధర్మపత్ని లక్ష్మి ప్రతీ కార్యక్రమంలో అయిన వెంటనే ఉంటూ కార్యక్రమం విజయవంతానికి పూర్తిగా సహకరించడం ఆదర్శ దంపతులుగా ప్రతి ఒక్కరు కీర్తిస్తూ ఉంటారు .చాతుర్మాస్య ఆధ్యాత్మిక పర్యటనలో ఆయా ప్రాంతాలలో ఉన్న మధ్వ గురువుల మూల బృందావనాలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శన కూడా అందరికీ చేయించి ఆ విశేషాలు నేటికీ ఎవ్వరు ఎప్పటికీ మరువలేరు. ఆధ్యాత్మిక అనుభూతి ప్రతి ఒక్కరూ పొందారు. ఇటువంటి పర్యటనలను నిర్వహించడం ఎంతో కష్ట సాధ్యమైనప్పటికీ ఆనందంగా చేయడం రాచూరి లోనే ప్రథమ లక్షణం .చాతుర్మాస్య పూజా సమయంలో రాచూరి కుటుంబం నుండి స్వామీజీకి ప్రత్యేక కానుక ఇవ్వడం ఒక సంప్రదాయంగా పెట్టుకొని ఆచరించిన గొప్ప వ్యక్తి రాచూరి. ఆయన సోదరులు కూడా కలిసిమెలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల విజయవంతనికి కృషి చేయడం గొప్ప విషయం .శ్రీ స్వామీజీతో కలిసి నది స్నానం చేస్తున్న సమయంలో లక్ష్మీ సన్నిధానంగా పేర్కొనే బనమూరి శంఖం రాచూరి కి లభిస్తే దానిని గౌరవంగా గురువులకు సమర్పించగా దానిని మీ పూజా మందిరంలోనే ఉంచుకొని నిత్యము అర్చించుకోవాల్సిందిగా స్వామీజీ ఆశీర్వదించడం ఆయన పూర్వజన్మ సుకృతంగా అందరూ ప్రస్తావించారు. ఎంతో కష్టమైన బృహతి సహస్ర యాగాన్నిఇ కాకినాడ మధ్వసభలో అందరి సహకారంతో శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆశీస్సులతో సుధా పండితులు శ్రీ కానుగోవి వాసుదేవా చార్ స్వీయ పర్యవేక్షణలో రెండు రోజులు పాటు అద్భుతంగా నిర్వహించి ఈ ప్రాంత ప్రజలకు అరుదైన ఆధ్యాత్మిక సంపద మరియు అనుభూతిని రాచూరిరాఘవేంద్ర స్వామి అందించారు.

కాకినాడమధ్వసభ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసిస్తూ మధ్వాచార్య శిలా విగ్రహాన్ని సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్ బహుకరించడం జరిగింది .ఆ విగ్రహానికి ప్రతి సంవత్సరం మధ్వ నవమినాడు అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నారు. గోదావరి జిల్లాలలో ఉన్న మధ్వ సంప్రదాయ ఆలయాల అభివృద్ధికి రాచూరి తనదైన సహకార అందిస్తూ ఆ ప్రాంతాల అభివృద్ధిలో అందరిని భాగస్వామ్యం చేస్తున్న గొప్పనాయకత్వం లక్షణాలు ఆయనలో చూడవచ్చు. ఐదు పదులు దాటిన రాచూరి రాఘవేంద్ర స్వామి పయనం శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామి పాదాలు నిలయమైన తిరుపతిలో జరగడం భగవంతుని ప్రేరణగా అందరూ గుర్తు చేసుకుంటూ అశ్రునైనాలతో శ్రద్ధాంజలి ఘటించడం ఎన్నటికీ మరువలేనిది. అరుదైన బ్రహ్మ కమలం తొలిసారిగా రాచూరి స్వగృహంలో విరిసినప్పుడు అందరినీ పిలిపించి అద్భుతాన్ని చూపించి దర్శన భాగ్యం కల్పించిన గొప్ప వ్యక్తి రాచూరి రాఘవేంద్ర స్వామి నీ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేర్కొనవచ్చును.

**- డా. యాతగిరి వేంకట పరశురామ్**
**సంయుక్త కార్యదర్శి, కాకినాడ మధ్వసభ కమిటి.**

# భద్రత ప్రమాణాలు తప్పకుండా పాటించాలి

## -కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జిల్లా ఫ్యాక్టరీ విభాగం ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో ఉన్న పలు పరిశ్రమలు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ, పరిశ్రమల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో కొన్ని నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదకర వ్యర్థాలు విడుదల చేసే పరిశ్రమలు నెల రోజులకు, మూడు నెలలకు, ఆరు నెలలకు తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలన్నారు.

ఆయా పరిశ్రమలలో అలారింగ్, సెన్సార్ పరికరాలు ఖచ్చితంగా పనిచేసేలా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడు శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ప్రతి పరిశ్రమ ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తున్నారో లేదో తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు. పరిశ్రముల వారు వినియోగిస్తున్న రసాయనాలు, వాటి యొక్క పరిమాణలు, తీసుకోవలసి ఈ జాగ్రతలు, మాక్ డ్రిల్, కమిటీ సమావేశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫ్యాక్టరీ తనిఖీ అధికారి జి..స్వాతి, అగ్ని మాపక అధికారి పి. శ్రీనివాస్, ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్, భాగ్య నగర్ క్లోయిడ్, సగ్గొండ, విజన్ డ్రగ్స్, త్రివేణి తదితర కర్మాగారముల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆర్డీవో రాణి సుస్మిత కొవ్వూరులోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వేసవి కాలంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి అందచేస్తున్న వివిధ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆకతాయిలకు వినూత్న శిక్ష..



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** మండపేట పట్టణంలో గురువారం రాత్రి మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్న పదిమంది ముద్దాయిలను ఎస్సై అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు సివిల్ కోర్టులో ప్రవేశపెట్టారు. వారందరికీ జడ్జి ఐ ప్రవీణ్ కుమార్ రూ.100 జరిమానాతో పాటు వారితో పరిసరాలను శుభ్రం చేయించాలని శిక్షను విధించారు. దానితో పోలీస్ సిబ్బంది సమక్షంలో స్థానిక ట్రెజరీ కార్యాలయాన్ని వారితో అధికారులు శుభ్రం చేయించారు.

## చలివేంద్రంలో మజ్జిగ వితరణ



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని జొన్నాడ గ్రామంలో జాతీయ రహదారి చెంతన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవికాల మజ్జిగ చలివేంద్రం బాటసారుల దాహార్తిని తీరుస్తుంది. గత పది సంవత్సరాల నుండి ఎంతోమంది దాతల సహకారంతో ఈ చలివేంద్రం కొనసాగుతుంది. అయితే శుక్రవారం గ్రామానికి చెందిన తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను) జన్మదినోత్సవం సందర్భంగా ఆయన మిత్రులు మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, వీరీ సందీప్ కలిసి ఒకరోజు మజ్జిగ వితరణ చేసి బాటసారలకు మజ్జిగ పంపిణీ చేశారు. రహదారిలో ప్రయాణించే సామాన్య ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏడాది చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), తమలంపూడి నాగ వెంకట సత్యనారాయణ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కౌమార బాలికల సాధికారత వైపు పయనం

**-బాలికల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కుమార్ బాలికలు సాధికారత సాధించే దిశగా అవగాహన కార్యక్రమాల ద్వారా ముందడుగు వేస్తున్నామని జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ బి. దుర్గారాణి అన్నారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి కె. విజయకుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ప్రాజెక్టు సిడిపిఓ సిహెచ్ ఎస్ కె. దుర్గాదేవి ఆధ్వర్యంలో పిఠాపురం మండలం మల్లం గ్రామంలో కిషోరీ వికాసము సమ్మర్ క్యాంపెయిన్ 5వ షెడ్యూల్ శిక్షణా తరగతులు నిర్వహించారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,
పౌష్టికాహారం వాటి విలువలు, ఆడపిల్లల ఆరోగ్యం రాబోయే తరాలకు ప్రభావితం చేస్తుందని, రానున్న సమాజాన్ని ఆరోగ్య వంతంగా చేయడానికి తొలి అడుగు ఇక్కడే పడాలని అన్నారు. ఆరోగ్య శాఖ వారు ఇచ్చే ఐరన్ టాబ్లెట్లు తప్పనిసరిగా వాడాలని సూచించారు. పిల్లల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహ నిర్మూలన చట్టాల గురించి అలాగే గురించి అవగాహన కల్పించారు. వివిధ అంశాల మీద పిల్లలకు ఈ తరగతులలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ నాగమణి, జి ఎం ఎస్ కే ఎం కృష్ణవేణి, కృష్ణవేణి, పి. సునీత, అంగన్వాడీ కార్యకర్తలు గంగా భవాని, జ్యోతి, భారతి, నూక రత్నం, వై. కుమారి, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

# ఏపి ఈఏపిసెట్-2025కు అన్ని ఏర్పాట్లు పూర్తి






## - ఈ నెల 19 నుండి పరీక్షలు
## - ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదు

**కాకినాడ,మేజర్‌న్యూస్** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్&ఫార్మశీకామన్ ఎంట్రన్స్‌టెస్ట్(ఏపి ఈఏపిసెట్) -2025కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ గారు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం విసి కాన్ఫరెన్స్ హాలు నందు ఏపి ఈఏపిసెట్ కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉపకులపతి మరియు ఈఏపిసెట్ ఛైర్మన్ ప్రొ.సిఎస్ఆంకె.ప్రసాద్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు .ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ & ఫార్మశీ విభాగాలకు మొత్తంగా 3,62,429 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరగదని, విద్యార్థులు వీలైనంత తొందరగా పరీక్షా కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన కంప్యూటర్ సరిగా పనిచేస్తుందో లేదో సరిచూసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎవరైతే ఉర్దూ మాధ్యమాన్ని ఎంచుకున్నారో వారికి కర్నూలు రీజనల్ సెంటర్‌లో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్‌లో రెండు సెంటర్లతో కలిపి మొత్తం 145 పరీక్షా కేంద్రాలలో అగ్రికల్చర్ మరియు ఫార్మశీ విభాగాలకు మే 19వ తేదీ నుండి మే 20వ తేదీ వరకు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21వ తేదీ నుండి 27వ తేదీ వరకు పరీక్షలను 14 సెషన్లలో నిర్వహించేందుకు కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు సారథ్యంలో అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు మరియు మధ్యాహ్నం 2.00గంటల నుండి 5.00గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు జెఎన్‌టియుకె తరపున సామాజిక బాధ్యతగా జూన్ నెలలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నామని, దీని ద్వారా విద్యార్థులకు ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విభాగాలలో ఎటువంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి, ఉపాధి అవకాశాలు, ప్రవేశం పొందే విధానం వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఏపి ఈఏపిసెట్-2025కు సంబంధించి 145 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తుండగా మొత్తంగా ఇంజనీరింగ్ విభాగానికి 2,80,597మంది, అగ్రికల్చర్ & ఫార్మశీ విభాగానికి 81,832మంది దరఖాస్తు చేసుకున్నారని, మొత్తంగా 3,62,429మంది పరీక్షలకు హాజరు కానున్నారని కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు. ఏపి ఈఏపిసెట్-2025 దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కేటాయించిన పరీక్ష తేదీన ఇతర జాతీయ స్థాయి పరీక్ష ఉంటే అటువంటి వారు సరైన డాక్యుమెంట్స్‌తో హెల్ప్‌లైన్ సంప్రదించడం ద్వారా వారికి వేరే పరీక్ష తేదీని కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వారికి అందుబాటులో ఉన్న పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం జరిగిందన్నారు. అంగ వైకల్యం (పిడబ్ల్యుడి) కలిగిన ఆరుగురు విద్యార్థులకు స్క్రైబ్ (సహాయకుడి)ను కేటాయించామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తును పూర్తించే సమయంలోసమాచారాన్నితప్పుగా పూరించినట్ల యితే ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, పరీక్ష పూర్తయిన తర్వాత కూడా ఈఏపి సెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదిస్తే తప్పులను సవరిస్తామన్నారు.అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు (ఒరిజినల్)ను, నలుపు లేదా నీలం రంగు బాల్‌పాయింట్ పెన్‌ను పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి గంటన్నర ముందుగా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. బయోమెట్రిక్ నమోదుకు ఆటంకం లేకుండా విద్యార్థుల చేతులకు మెహందీ వంటివి పెట్టుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌లను తీసుకువెళ్లకూడదని, పరీక్షా సమయంలో వినియోగించే రఫ్‌పేపర్లనుసైతం ఇన్విజిలేటర్లకు ఇచ్చేయాలని స్పష్టంచేశారు. ఏపి ఈఏపి సెట్-2025 హాల్‌టికెట్‌లను విద్యార్థులు ఏపిఈఏపి సెట్ వెబ్‌సైట్ https://cets.apsche.ap.gov.in తోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ '9552300009' ఫోన్ నెంబర్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వారికి కేటాయించిన పరీక్షా కేంద్రం యొక్క రూట్‌మ్యాప్‌ను తెలుసుకునేందుకు హాల్‌టికెట్ చివరి పేజీలో గూగుల్ మ్యాప్ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థికి కేటాయించిన పరీక్షా కేంద్రం యొక్క పూర్తి చిరునామాను https://cets.apsche.ap.gov.in/eapcet/Eapcet/EAPCET_Centers.aspx ద్వారా తెలుసుకోవడంతో పాటు గూగుల్ మ్యాప్‌ను పొందవచ్చునన్నారు. విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం అయ్యేలా ఏపి ఈఏపిసెట్ వెబ్‌సైట్‌లో మాక్‌టెస్ట్‌లను పొందపర్చడం జరిగిందన్నారు. ఏపి-ఈఏపిసెట్ పరీక్ష నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల పరీక్షా కేంద్రాల పరిశీలకులకు, ఛీఫ్ సూపరింటెండెంట్‌లకు తగు సూచనలు జారీ చేశామని కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు పేర్కొన్నారు. అలాగే ఎండలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు కల్పించాల్సిన వైద్య సదుపాయాలు, బందోబస్తు, రవాణా, విద్యుత్ సరఫరా గురించి సంబంధిత శాఖాధికారులకు మరియు అన్ని జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు కన్వీనర్ వివరించారు.

విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ద్వారాగాని, 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్లలో గాని, helpdeska-peapcet@apsche.org మెయిల్ ఐడి ద్వారా గాని సంప్రదించవచ్చునని కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు. ఈ సమావేశంలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ ప్రకటించాలని వినతి





## - రెండో రోజు కొనసాగిన ఆదివాసీ రిలే దీక్షలు

**రంపచోడవరం, మేజర్‌న్యూస్** : 2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ ప్రకటించాలని ఏపీసీఎం నారా చంద్రబాబునాయుడుకు ఆదివాసీ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రంపచోడవరం ఐటిడిఏ పిఓ కట్టా సింహాచలంకు ఆదివాసీ జేఏసీ నాయకులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ముందు రెండో రోజు జరిగిన రిలే నిరాహార దీక్షలు కార్యక్రమానికి ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అధ్యక్షత వహించారు. రిలే నిరాహార దీక్షలు సందర్భంగా ఆదివాసి జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాస్ మాట్లాడుతూ 2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ఆదివాసి ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జీవో నెంబర్ 3కు చట్ట బద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు అరకులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు మంజూరు చేయాలని, మొదలైన సమస్యల పరిష్కారం కోసం సిఎం చంద్రబాబు నాయుడుకి వినతి పత్రం ఐటిడిఏ పిఓకట్టా సింహాచలం ద్వారా పంపించాలని వినతిపత్రం అందజేసారు.ఈ కార్యక్రమంలో మడకం బంగారు బాబు మాట్లాడుతూ ఆదివాసి నిరుద్యోగుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆదివాసీ నిరుద్యోగులకు పట్ట భద్రులకు స్పష్టమైన హామీ సీఎం చంద్రబాబు ఇచ్చేంత వరకు రిలే నిరాహార దీక్షలు దశలవారీగా కొనసాగిస్తామన్నారు. రిలే నిరాహార దీక్షలు కార్యక్రమంలో కొమరం సూర్యచంద్ర దొర, మట్ల కృష్ణారెడ్డి, కుంజం వెంకన్న దొర, కొండ్ల సత్యనారాయణ రెడ్డి, కారం రామన్న దొర, మద్దేటి అంజిరెడ్డి, చెదల శిరీష కుమారి, సాదల దేవి, చెదల కనకమహాలక్ష్మి, పొడియం పండుదొర, చవలం శుభకృష్ణ దొర, పండా పవన్ కుమార్, కుంజం అగ్గిదొర, కత్తుల ఆది రెడ్డి, శారపు నాగేశ్వరరావు, కొమరం కిషోర్ దొర, మూలపర్తి గౌరీ శంకర్, మడకం శివ దుర్గాప్రసాద్ దొర, కత్తులు నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, కురసం పకీర్ దొర, కారం జగన్ స్వరూప్ దొర, కడబాల లక్ష్మీనారాయణ, నడిపూడి సంజీవరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, మడకం వరప్రసాద్ దొర, ఈక వెంకన్న దొర, చవలం వెంకన్న దొర, కడబాల రాంబాబు రెడ్డి, బొరగా పొట్టి దొర, నైని లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో పారదర్శకంగా పోలీస్ బదిలీలు



**కాకినాడ, మేజర్ న్యూస్** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా పోలీస్ సిబ్బందికి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ చేపట్టారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బందికి సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఒకే పోలీసు స్టేషన్లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మొత్తం 85 మంది సిబ్బందిలో, 19 మంది ఏఎస్సైలు, 43 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 23 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఖాళీల వివరాలు జాబితాను ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. సిబ్బంది తమ ఇష్టానికి అనుగుణంగా, ఖాళీలు ఉన్న పోలీస్ స్టేషన్లను ఎంచుకునేలా అవకాశం కల్పించారు. పోలీస్ స్టేషన్ల మధ్య సమతుల్యతను పాటిస్తూ పట్టణాల్లో పని చేస్తున్న సిబ్బందిని రూరల్ స్టేషన్లకు, రూరల్ స్టేషన్లల్లో పని చేస్తున్నవారిని పట్టణ ప్రాంత పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగస్తులుగా ఉన్నవారికి, అనారోగ్య కారణాలతో ఎదురవుతున్న సిబ్బందికి అవసరమైన మినహాయింపులు ఇచ్చి వారు కోరిన ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎటువంటి మనోభేదాలు లేకుండా నిర్వహించడంతో సిబ్బంది హర్షాతిరేకాలు వ్యక్తంచేసి, జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా, ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎంజెవి భాస్కరరావు, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలన అధికారి మూర్తి, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాటర్ బాడీస్ సంరక్షణకు కృషి చేయండి



కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలోని చెరువులు, కాలువలు, డ్రెయిన్లు, వాగులు తదితర వాటర్ బాడీస్ ఆక్రమణలకు, ధ్వంసానికి గురికాకుండా కాపాడాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో వాటర్ బాడీస్ సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటైన జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ తొలి సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింగి. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు, దుర్వినియోగాల వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారితీయకుండా నివారించేందుకు రెవెన్యూ అధికారుల అధ్యక్షతన, మున్సిపల్, పంచాయితీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ తదితర శాఖల అధికారులు సభ్యులుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఈ వాచ్ డాగ్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా రికార్డులలో నమోదైన చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, డ్రైన్లు తదితర వాటర్ బాడీస్ వివరాలను పరిశీలించి, వీటిలో ఇప్పటికే గుర్రైన వ్యవస్థలను గుర్తించాలని, అలాగే ఇకపై ఆక్రమలు జరుగకుండా నిరోధించాలని జాయింట్ కలెక్టర్ కమిటీ సభ్య శాఖల అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయితీ, మున్సిపల్, కుడా యాజమాన్యంలో ఉన్న చెరువులకు కంచెలు ఏర్పాటు ద్వారా పరిరక్షించాలని సూచించారు. కాలువలు, చెరువుల గట్లను డంపింగ్ యార్డులుగా వాడకూడదన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లోని కాలువ గట్లపై కొబ్బరిబొండాలను, కూల్చిన భవన శిథిలాల డెబ్రిస్ ను డంప్ చేయడం వల్ల ప్రవాహాలు కుచించుకుపోతున్నాయని, కాలువలను ధ్వంసం చేస్తున్నా వారిపై కఠిన చర్యలు చేపట్లాలని ఆదేశించారు. అలాగే గ్రామాలు, పట్టనాల్లోని జనావాసాల మురుగునీరు కాలువలు, చెరువుల్లోనికి విడిపెట్టకుండా నిరోధించాలన్నారు. వాటర్ బాడీస్ ఆక్రమణలకు సంబంధించిన కోర్టు వివాదాల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. డివిజన్, మండల స్థాయి వాచ్ డాగ్ కమిటీలను కూడా పునరుత్తేజపరచాలని వాటర్ బాడీల ఆక్రమణలకు గుర్రైనపుడు ఈ కమిటీలు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి జిల్లాలోని వాటర్ బాడీల వివరాలు, వాటిలో జరిగిన ఆక్రమణలు, ఆక్రమణ విస్తీరణంలో ఉన్న పంటల సాగు, సివిల్ నిర్మాణాలు వివరాలు, కోర్టు వివాదాలు, ఇకపై ఆక్రమణలకు గురికాకుకండా చేపట్టిన చర్యలపై సమగ్ర వివరాలతో హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ సభ్య శాఖల అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, మున్సిపల్ పరిపాలన ఆర్.డి. ఆర్.నాగనరశింహారావు, డిపిఓ వి.రవికుమార్, కాకినాడ, పెద్దాపురం ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, కాలుష్య నియంత్రణ మండలి, కుడా, డ్రైనేజి, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# 10వ రోజుకు చేరుకున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె



**పెద్దాపురం, మేజర్ న్యూస్** : పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు చేపట్టిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శుక్రవారానికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ నాయకులు మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరూ సమ్మెకు వెళుతున్నామని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో వాకాడ భాస్కరరావు, సుంకర నాగేశ్వరరావు, కె.వి.రమణ, డి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, ఎస్.సత్తిరాజు, డి.రాజు, పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మఠ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన శిల్పి బృందం



**రాజమండ్రి, మేజర్ న్యూస్** : 16 శతాబ్దాలు చరిత్ర కలిగిన రాజమండ్రి ఉత్తరాది మఠ భవన పునర్నిర్మాణ కార్యక్రమాల నిమిత్తం నరసరావుపేటకు చెందిన శ్రీనివాస వర్మ శిల్పి స్థల పరిశీలన నిమిత్తం నగరానికి వచ్చారు. ఆయనకు ఉత్తరాది మఠ పురం నిర్మాణ కమిటీ సభ్యులు వివరాలను వివరించారు. అంతకముందు సుధా పండితులు మఠాధికారి విజయ సింహా ఆచార్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో రాతితో ఆలయ నిర్మాణాలను నిర్వహిస్తున్న శ్రీనివాస వర్మను కలిసి రాజమండ్రి ఉత్తరాది మఠం తాలూకు కొత్త భవనాలను నిర్మించాలన్న ప్రతిపాదనను తెలుపగా అందుకు వర్మ అంగీకరించి రాజమండ్రి విచ్చేశారని కందళం నరసింహారావు తెలిపారు. రాతి కట్టడాల లో మంచి నైపుణ్యం ఉన్న శిల్పి వర్మ అని అనేక ఆలయాలను నిర్మించిన దాఖలాలను తాము పరిశీలించామని వివరించారు. గోదావరి గట్టు ఉన్న రాజమండ్రి ఉత్తరాది మఠానికి చెందిన భవన సామర్థ్యాన్ని కాకినాడ జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ ఇంజనీర్లు పరిశీలించి తక్షణమే తొలగించాలని భవన సామర్థ్యం పూర్తిగా లోపించిందని వంద సంవత్సరాలకు పైగా నిర్మాణం జరిగినట్టుగా వారు ధ్రువీకరించారని నరసింహారావు వివరించారు. .ఈ విషయాన్ని మఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని మఠాధికారి విజయసింహచార్ నేతృత్వంలో నిర్మాణ కార్యక్రమాలకు స్వామీజీ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన నిర్మాణం జరగాలన్న ఆశయంతో పునర్నిర్మాణ కమిటీ తెలుగు రాష్ట్రాలలో శిల్పుల వివరాలను పరిశీలించి చివరకు నరసారావు పేట కు చెందిన శిల్పి వర్మ ను కలిసామని నరసింహారావు వివరించారు. రాతి నిర్మాణ కట్టడాలు శ్రేష్టంగా ఉంటాయన్న భావన తో మరియు ఎంతో చరిత్ర కలిగిన గురువుల మూల బృందావనాలు ఇక్కడ ఉండడం దృష్ట్యా మరింత శ్రద్ధ తీసుకొని కట్టడాలను పూర్తి చేయాలన్న అభిప్రాయాన్ని వర్మ వ్యక్తం చేశారని త్వరలో నిర్మాణం తాలూకు స్కెచ్ రూపొందించి తీసుకొస్తానని తెలిపారని నరసింహారావు ప్రస్తావించారు. శిల్పి వర్మ బృందం మఠ ప్రాంగణంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి తో పాటు గురువుల బృందావనాలను దర్శించుకున్నారు. పవిత్ర గోదావరి తీరంలో ఉన్న ఇటువంటి ఆలయ భవన నిర్మాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తానని వర్మ తెలిపారు. కార్యక్రమంలో చట్టి హనుమంతరావు, కందాల నరసింహారావు, సారంగి ఆదిత్య, ద్రోణం రాజు రామారావు, కృష్ణ ద్వైపాయన, న్యాపతి రవీంద్ర, రాచూరి కళ్యాణ్ చక్రవర్తి తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీడీవో



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : మండలంలోని రాజవరం గ్రామంలో గురువారం కాలువలో ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో మరణించిన ఉపాధి కూలీ తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను శుక్రవారం వీడియో ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని వివరాల అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ఆర్థిక సహాయం మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధైయబడవద్దని ఓదార్చారు. ఈయన వెంట గ్రామ సర్పంచ్ జాన మంగాయమ్మ ఆంజనేయులు, ఏపీవో విజయ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నాంచారమ్మ ఉన్నారు.

# మంత్రి చేతుల మీదగా పురస్కారాలు అందుకున్న రాజవొమ్మంగి బీసీ విద్యార్థులు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్** : జిల్లాలోనే ఉత్తమ ప్రతిభ కనపర్చిన రాజవొమ్మంగి బీసీ వసతి గృహ విద్యార్థులకు మంత్రి సవిత ఉత్తమ పురస్కారం అందజేశారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లోఅల్లూరి జిల్లా రాజవొమ్మంగి బీసీ బాలుర, బాలికల వసతి గృహ విద్యార్థులు మాకిరెడ్డి జగత్ 479, నల్లమ శ్రీదుర్గ 5 26 మార్కులు సాధించడంలో రాష్ట్ర బీసీ సంకేమ శాఖ మంత్రి ఎస్.సవిత విజయవాడలో ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అంద చేసినట్లు హాస్టల్ వెల్ఫేర్ అధికారులుటి శంకర్, పి. దుర్గ భవాని తెలిపారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అధికారులను మంత్రి అభినందించారు.

# వరదలు దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంతాలో ప్రత్నామయ ఏర్పాటు ప్రభుత్వం చేయాలి

**-సిపిఎం డిమాండ్**



**కూనవరం,మేజర్‌న్యూస్** : గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ముంపు ప్రాంత ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు.మండలంలోని శ్రీ మార్త శ్రీరాంమూర్తి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముంపు లేని ప్రాంతంలో ముందుగా బఫర్ స్టాక్,బియ్యం, నిత్యవసర సరుకులు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే వరదల సమయంలో ప్రత్యామ్నాయంగా ముంపు లేని ప్రాంతాల నుండి విద్యుత్ లైన్ వేయాలనీ గతం నుండి వరదలలో ముంపు ప్రాంతాల్లో కరెంటు గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు ఉంటాయని ఒకపక్క వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేస్తుంటే పోలవరం బ్యాక్ వాటర్ భయం ముంపు ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారని అన్నారు.కానీ ప్రభుత్వ అధికారులు ఇంతవరకు ముంపు పై దృష్టి లేకపోవడం ముంపు ప్రాంత ప్రజలను గాలికి వదిలేయడమేనని అన్నారు.వచ్చే జూన్ జూలై నెలలో తక్షణమే ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మండలంలోని సమీక్ష సమావేశాలు పెట్టాలని డిమాండ్ చేసారు. తక్షణమే శబరిపరివాహక గ్రామాలకు వరదల వలన కరెంటు ఇబ్బందులు పడుతున్నారు తక్షణమే మెయిన్ రోడ్డు మీదుగా నరసాపురం వరకు విద్యుత్ లైన్ కనెక్టివిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు మాడెం బాబు, బొగ్గ సుబ్బయ్య,పాయం సత్యనారాయణ, నానుపల్లి వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు సర్పంచ్ సోడా శంకర్,బొగ్గా రామారావు ఎంపిటిసి ధర్మల అమ్మాజీ, నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు, గుండం బాబురావు, తాళ్ళూరి శ్రీనివాసరావు,తెల్లం తమ్మయ్య,న్యాయవాది మడివి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ఆపరేషన్ సింధూర్ తిరంగయాత్ర' ర్యాలీ






**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** పహల్గమ్ ఉగ్రవాదుల దాడికి ప్రతి చర్యగా భారత భూమిపై దాడి చేస్తే పర్యావసానం ఎలా ఉంటుందో ఉగ్రవాదులను అంతమొందించి భారత ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ సింధూర్ " ద్వారా అద్భుతమైన విజయంతో ప్రపంచానికి మన సైనిక శక్తిని తెలియజేసిన సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో శుక్రవారం తిరంగ ర్యాలీ యాత్ర ఘనంగా నిర్వహించడం జరిగింది. ర్యాలీలో జై బోలో భారత్ మాతాకీ జై జై భారత్ మాతాకీ అంటూ నినదించారు. ఆపరేషన్ సిందూర్ కోట్లాది మంది భారతీయుల మనోభావాలకు ప్రతీక అని, ఇది మన సైన్యం సాధించిన ఘనవిజయమని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి అన్నారు.

ఈ విజయం మన సైనికుల వీరత్వానికి, మన దేశ సార్వభౌమాధికారానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనిక ఉద్యోగి గోవిందరావు ను సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి ఆధ్వర్యంలో రంపచోడవరంలో 'ఆపరేషన్ సింధూర్ తిరంగయాత్ర' కార్యక్రమాని నిర్వహించారు.భారతదేశ పౌరులపై ఉగ్రదాడికి ప్రతిదాడిగా మనదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలో పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ భద్రత దళాలు (త్రివిధ దళాలు ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ నేవీ) విజయవంతంగా ఆపరేషన్ సింధూర్ పూర్తిచేసిన త్రివిధ దళాల సైనికులకు మోదీ గౌరవ వందనం సమర్పించే తిరంగ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం రంపచోడవరంలో శ్రీ విరాట్ విజయ ఆంజనేయ సహిత శ్రీకోదండ రామాలయం నుండి ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదగా వాల్మీకి విగ్రహం వరకు తిరిగి శ్రీ కోదండ రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా తిరంగ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలువురు నాయకులు పాల్గొని భారత దేశం సైనికులకు, ప్రధానమంత్రి మోదీకి గౌరవ వందనం చేశారు. ఈకార్యక్రమంలో పౌరులతో కలిసి స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, బిజెపి నాయకులు ఈక బుల్లి కొండల దొర, కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, కెఎల్ ఎన్ గురు ప్రసాద్, కుంజం వెంకటేశ్వర్లు దొర, కంగల శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు గౌస్ మొహిద్దిన్, సారపు వీర ప్రతాప్ దొర, మడకం ప్రసాద్, కారం రామన్న దొర, తుర్రం బాబురావు పాల్గొన్నారు.

# ఆత్రేయపురంలో గోదావరిలో స్నానం చేస్తూ యువకుడు గల్లంతు

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురం గౌతమి గోదావరిలో శుక్రవారం ఒక యువకుడు స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఎస్సై ఎస్.రాము తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తలపాకల జానీ (20) అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మమ్మ యార్లగడ్డ చిట్టమ్మ ఇంటికి వచ్చారు. శుభకార్యం ముగించుకుని ఇంటికి వెళ్దాం అన్న తరుణంలో జానీ తన స్నేహితుడితో కలిసి గోదావరికి స్నానానికి దిగారు. ప్రవాహ వేగం ఎక్కువగా ఉండటంతో కాలుజారి గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని స్నేహితులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారంతా కన్నీరు మున్నీరు అవుతున్నారు. జానీ ఆచూకీ కోసం ఎస్ఐ ఎస్.రాము, కూటమి నాయకుడు ముదునూరి రామ బద్దిరాజు గ్రామస్తులు తో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ తెలియ రాలేదు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.







# ఈ నెల 21 నుండి వేసవి విశిష్ట

# మనో విజ్ఞాన శిక్షణా కార్యక్రమం

కాకినాడ, మేజర్ న్యూస్ : వ్యక్తిత్వ వికాస సమాజం మరియు గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్స్ ఆధ్వర్యంలో వేసవి విశిష్ట మనోవిజ్ఞాన శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మొట్టమొదటిసారిగా కాకినాడలో ఈ కార్యక్రమం జరుగనున్నది. ఈ నెల 21వ తేదీ నుండి 30వ తేదీ వరకూ ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకూ అచ్యుతాపురం గేటు సమీపంలో, జిపిటి కాలనీ, మెహెర్ నగర్ లో వున్న వాథూలసంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రముఖ సైకాలజిస్టులు డాక్టర్ వి. జనార్ధనం, డాక్టర్ ఎన్.మహాలక్ష్మి కుమార్, డాక్టర్ వి.మనోహర్, ఎ.ఉదయభాస్కర్, పి.సుబ్బరాజు, హైమ, కేశవాచార్యులు, కె.సుబ్బారావు, అక్కింశెట్టి రాంబాబు, బి.లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుందని తెలిపారు. వివరాలకు వి.జనార్దనం – 8374232579, ఎ.ఉదయభాస్కర్ – 9949174059, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి 9441563789 నెంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. 60 మందికి మాత్రమే ప్రవేశం వుందని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# పదవికి న్యాయం చేస్తా

## - చేనేత కార్మికుల కష్టాలపై పోరాటం చేస్తా

## - పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి చేనేత విభాగం అధ్యక్షులు గోపి హరిబాబు



యు.కొత్తపల్లి మేజర్‌న్యూస్ : పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి చేనేత విభాగం అధ్యక్షునిగా వాకతిప్ప గ్రామానికి చెందిన గోపి హరిబాబును నియమించినట్లు పార్టీ నాయకులు, వైఎస్ఆర్సిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా గోపి హరిబాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈపదవి ఇవ్వడం పట్ల నాకు ఎంతో ఆనందంగా ఉందంటూ ఆయన తెలిపారు. చేనేత కార్మికుల కష్టాలపై పనిచేస్తానని ప్రతి చేనేత కార్మికులకు అండగా నిలబడతానంటూ ఆయన అన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన పిఠాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ వంగా గీత విశ్వనాథ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనతోపాటు పదవ చేపట్టిన ప్రతి ఒక్కరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం




**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** మనం ఉండే పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజ సాధించుకోవచ్చని ఆత్రేయపురం పిహెచ్సి వైద్యాధికారులు హైమ, శ్రీ సౌమ్య లు అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. దీనిలో భాగంగా డెంగీ ని ఓడించండి, పరిశీలించండి, శుభ్రం చేయండి అనే మూడు పద్ధతులు పాటించండి అనే నినాదం ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ అరుణ కుమారి, సూపర్ వైజర్ సూర్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దోమ కాటుతో డెంగ్యూ



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** దోమ కాటు వలన వచ్చే వ్యాధుల్లో తీవ్రమైంది డెంగ్యూ అని, దీనిని సకాలంలో నయం చేయకపోతే ప్రాణాంతకం అవుతుందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జ్వరం, ఎముకల నొప్పులు, కళ్ళు కదలడం కష్టంగా మారడం, కళ్ళలోంచి నీరు కారడం, ఆకలి తగ్గి వాంతులు అయ్యేటట్లు ఉండడం, శరీరం మీద దద్దుర్లు, పొక్కులు రావడం, ముక్కులో నుంచి రక్తం కారడం, రక్త విరోచనాలు, విపరీతంగా తలనొప్పి డెంగ్యూ వ్యాధి లక్షణాలని అన్నారు. ఈ వ్యాధి వచ్చిన వెంటనే రోగిని ఆసుపత్రికి చేర్చాలని, రోగికి తరచూ ద్రవ పదార్థాలు అవసరమైతే రక్త మార్పిడి చేయాల్సి ఉంటుందని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవల్లి, అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

# ప్రతినెలా మూడోవ శనివారం స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం

-మే నెల కాన్సెప్ట్ బీట్ హిట్ నేపథ్యంలో "నీరు - మీరు" కార్యక్రమం

-జిల్లా డివిజన్ మండలస్థాయి అధికారులు సూచనలు

-జెసి ఎస్.చిన్న రాముడు



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** వేసవిదృష్ట్యాజిల్లా వ్యాప్తంగా ప్రతి రహదారి మార్గంలో, పల్లెల్లో, ప్రధాన కూడళ్లలో త్రాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జేసి ఛాంబర్ లో స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి టిసీతారామ మూర్తితో సమన్వయ శాఖల అధికారులతో, జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి, దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, వేసవి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, ఇందు కోసం ప్రజలకి ఎక్కడికక్కడ చల్లని త్రాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. శనివారం ముఖ్య కూడళ్లలో, సచివాలయం పరిధిలో ఆయా ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా షేడ్స్, త్రాగునీరు, మెడికల్ శిబిరాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పశుపక్ష్యాదుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 202 పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే నేపథ్యంలో వృద్ధులు, చిన్నారుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, అందులో భాగంగా ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్‌చిన్నరాముడు ఆదేశించారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల ఉరుములు మెరుపులుతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని జేసి చిన్న రాముడు పేర్కొన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో, చెట్లు వద్ద అటువంటి సమయంలో ఉండకూడదని తెలిపారు. రెండు మూడు చోట్ల పిడుగులు పడిన సందర్భంలో మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. పిడుగులు పడిన సమయంలో చెట్ల వద్ద , కరెంట్ స్తంభాలు వద్ద ఉండడం అత్యంత ప్రమాదకర మన్నారు. మే నెలలో జరుపుకుంటున్న స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నీరు మీరు ప్రజల్లోకి సమర్ధవంతంగా తీసుకుని వెళ్లడం లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మండల, గ్రామ ప్రధాన పంచాయతీ లలో ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు.

# ఎంపీ సానా సతీష్ బాబు ప్రజాదర్బార్‌కి వినతుల వెల్లువ





కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నేడు శుక్రవారం ఐదవ ప్రజాదర్బార్‌ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు కార్యాలయం వద్ద నిర్వహించారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొని తమ సమస్యలను తెలిపారు. 35 వినతులు స్వీకరించి వాటిలో అప్పటికప్పడు 3 అర్జీలను అప్పటికప్పుడు పరిష్కరించామని క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వేంకటేశ్వరరావు, తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, ఆనంద్ న్యూటన్, బిఆర్‌యుసిసి మెంబెర్ ముత్యాల అనిల్, బండి నరేంద్ర, యాళ్ళ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# పలు బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**కె.గంగవరం, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శుక్రవారం కే గంగవరం మండలంలోని పలు గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

కే గంగవరం మండలంలోని గంగవరం గ్రామం ఆర్అండ్‌బి రోడ్డు నుండి పెద్దింశెట్టి వారి పాలెం , కోటిపల్లి ఆర్అండ్‌బి రోడ్డు నుండి కోట ,కోట గ్రామంలోని ఆర్అండ్‌బి రోడ్డు నుండి రాజువారి కోట , బట్లపాలిక గ్రామం నుండి కావూరి వారిపేట రోడ్డు , ఎర్రపోతవరం గ్రామం నుండి రాళ్లగుంట గ్రామం వరకు సుమారు 4 కోట్ల 50 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేసి ఫైలాన్ ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్దేలక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంద న్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల మధ్య కనెక్టివిటీని మెరుగుపరచడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి కూడా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ యేసు రత్నం, వాసంశెట్టి సత్యం,కే గంగవరం సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ,ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనులు - డిప్యూటీ కమిషనర్ చక్రధర్ రావు





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:**కోనసీమతిరుమలవాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలు కల్పనే లక్ష్యంగా పనులు చేస్తున్నామని డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు అన్నారు. శుక్రవారం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అన్నదాన భవన నిర్మాణానికి అంబాజీపేటకు చెందిన నిచ్చెన కోళ్ల మునేశ్వరరావు, వేంకటలక్ష్మి దంపతుల ుమరియువారికుటుంబసభ్యులు రూ.1,63,905లు విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దాతలకు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# కెనాల్ రోడ్డు ట్రాఫిక్ మళ్ళింపు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** సామర్లకోట నుండి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపుతున్న నేపథ్యంలో నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపుకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనులు 4 రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న రహదారి పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్ లో గడ్డర్లు లేపుతున్నందున ఈ నెల 27, 28 తేదీలలో (రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు) రెండు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాలలో తమ వాహనాలను నడుపుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.

# మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :**పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మఅమ్మవారిని బంగారు పుష్పాలు,వెండిపుష్పాలతో ఆసాదులు, వేదపారాయణదారులు, పూజ, అర్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పులిహోరప్రసాదవితరణచేయడం జరిగింది. ఈకార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి,ఆసాదులురాయరామచంద్రప్రసాద్(నాని),రాయవిజయ్ కుమార్,సిబ్బందివెంకటరమణ,గౌరి,వరహాలు,లోవ,శివ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సహకారంతో...ప్రపంచ స్థాయిలో రాణించాలి



## - జాయింట్ కలెక్టర్ నిషాంతి

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** క్రీడాకారులు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో క్రీడా స్ఫూర్తితో ప్రపంచ స్థాయిలో రాణించి కోనసీమ జిల్లా యొక్క కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు క్రీడాకారులకు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక జీఎంసి బాలయోగి స్టేడియం నందు వార్షిక వేసవి శిక్షణ శిబిరాలు–2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన సంబంధించిన క్రీడా పరికరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి, అముద చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు లు క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా క్రీడల పట్ల ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తూ యువతకు భరోసాగా నిలుస్తోందని యొక్క అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడా రంగాన్ని ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు. క్రీడాకారులు క్రీడల పట్ల స్ఫూర్తిని ఆసక్తిని పొంది పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు ఎస్.యానాం బీచ్ నందు అంతర్జాతీయ నమూనా కొలతలతో క్రికెట్ స్టేడియం ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్టేడియం నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. భవిష్యత్తులో అనేక రకాల ఈవెంట్లను జిల్లాలో నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఇటీవల ఎస్.యానం బీచ్‌లో మహిళ వాలీబాల్ పోటీలను జాతీయస్థాయిలో నిర్వహించామన్నారు. జిల్లాలో అన్ని క్రీడా అంశాల పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ జాతీయ స్థాయి క్రీడా కారులను తీర్చిదిద్దేలా ముందుకు వెళతామని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వార్షిక వేసవి శిక్షణ శిబిరాలు–2025 ఈ నెల ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకు 8 నుండి 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు 50 చోట్ల శిక్షణ శిబిరాలను వ్యాయామ ఉపాధ్యాయుల సమన్వయంతో నిర్వహించడం జరుగుతోందన్నారు. 19 క్రీడాంశాలలో జిల్లాలో ఆదరణ అవసరమైన క్రీడలకు సంబంధించిన శిబిరాలను నడుస్తున్నాయన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ 50 శిక్షణ శిబిరాలను జిల్లాకు మంజూరు చేస్తూ ఒక్కొక్క క్రీడా శిక్షణ శిబిరానికి రూ.7 వేలను కేటాయించగా వీటిలో క్రీడా పరికరాలు సమకూర్చుటకు రూ.5 వేలు, గౌరవ వేతనంగా రూ.1500లు, ఇతర ఖర్చులకు రూ.500లు కేటాయించారన్నారు.

ఈ శిబిరాలను శిక్షకులతో శ్రీ మెన్‌కమిటీ ఏర్పాటుచేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. క్రీడాంశాల ద్వారా మానసిక ప్రశాంతత శారీర దారుఢ్యం ఉల్లాసాన్ని పొందడంతో పాటు మంచి క్రీడా స్ఫూర్తితో ప్రపంచ స్థాయిలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. చివరిగా శిక్షణా శిబిరాలకు క్రీడా పరికరాలను వారిచేతుల మీదుగా బహూకరించారు. ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పిఎస్ సురేష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

**ఎటపాక,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో జనసేన పార్టీ ఎటపాక మండల ఉపాధ్యక్షులు సతీష్, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎటపాక మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు, నాయకులకు శుక్రవారం కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన మండల ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గొప్ప ఆశయంతో జనసేన పార్టీ కార్యకర్తలకు ఒక భరోసా ఇవ్వటం కోసం సభ్యత్వం నమోదు చేయించడం జరిగింది అని, ఈ సభ్యత్వం ద్వారా 500 రూపాయలతో సభ్యత్వం తీసుకున్న వాళ్లకి ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ అలాగే 50 వేల వరకు ప్రమాద బీమా కల్పించడం జరిగింది అని, రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా కార్యకర్తల కోసం ఆలోచించనున్న మహా నాయకుడు జనసేన పార్టీ అధినేత మన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వంటి నాయకుడి అడుగుజాడల్లో నడుస్తున్నందుకు మేమందరం గర్వపడుతున్నా మని ఆయన అన్నారు.



ఎటపాక మండలంలో అత్యధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు అవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో మొల సతీష్, మంద సుబ్రమణ్యం, ప్రదీప్, నరేష్, నాగేష్, వెంకన్న, ప్రసాద్, మహేష్,సాయి,వెంకటేష్, వంశీ, వినయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఆర్డిడిఎస్ పథకం పల్లెలకు ఒక వరం



- -గ్రామ గ్రామానికి త్రీఫేస్ కరెంట్ ఇవ్వడంలో పెరవలి మండలం ముందంజ
- -పెరవలి మండలంలో పనిచేసిన మూడు సంవత్సరాలు ఒక మధురానుభూతి
- -పెరవలి విద్యుత్‌శాఖ ఏఈ ఎం డేవిడ్ నిచ్చల్

**పెరవలి,మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం వారి ఆర్డిడిఎస్ పథకం పల్లె పల్లెకు త్రీఫేస్ కరెంటు ఇవ్వడానికి ఒక వరం లా పనిచేస్తుందని పెరవలి మండలం విద్యుత్ శాఖ ఏఈ ఎం డేవిడ్ నిచ్చల్ మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ పథకాన్ని పూర్తిగా వినియోగించుకొనుట ద్వారా పెరవలి మండలం పల్లె పల్లెకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అమలులో పెరవలి మండలం ముందంజలో ఉందని ఆయన అన్నారు.

తాను పెరవలి మండలం విద్యుత్ శాఖ ఏఈగా పదవి బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాలు పూర్తయ్యాయని గడచిన ఈ మూడు సంవత్సరాలు వృత్తిపరంగా తనకు చాలా సంతృప్తినిచ్చిందని ఆయన అన్నారు. పెరవలి మండల విద్యుత్ అధికారిగా బాధ్యతలు స్వీకరించి నేటితో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏఈ ఎం డేవిడ్ నిశ్చల్ ను మేజర్ న్యూస్ ప్రతినిధి కలిసిన సందర్భంలో ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. తాను పెరవలి మండల విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న కాలంలో ప్రజా ప్రతినిధులు పెద్దల సహకారంతో మల్లేశ్వరం గ్రామంలో నూతన విద్యుత్తు ఉప కేంద్రం నిర్మించడం జరిగిందని ఈ విద్యుత్ ఉపకేంద్రం నిర్మించడం వల్ల పరిసర గ్రామాలలో నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఆయన అన్నారు.

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వపథకం ఆర్డిడిఎస్ ద్వారా పల్లె పల్లెకు 3ఫేస్ విద్యుత్ సరఫరాకు అవసరమైన పోల్స్ వైరింగ్ పూర్తయిందని దీనికి సహకరించిన విద్యుత్ సిబ్బందికి ఇతరులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే శిరీష





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డిను శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయభాస్కర్ దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా సీనియర్ బిజెపి నాయకులుచోళ్ళ బొజ్జిరెడ్డిను కూటమి ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవివిజయభాస్కర్ దంపతులు రంపచోడవరం లోని ఆయన నివాసానికి వెళ్లి ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రీవెన్స్‌లోసమస్యలపై వినతులు.. .రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే శిరీష దేవి గ్రీవెన్స్‌నిర్వహించడం జరిగింది. రంపచోడవరం నియోజకవర్గం,పలు మండలాల నుంచి రోడ్లు, మంచినీటి సౌకర్యం కొరకు, భూ సమస్యలు ఇతర సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి వినతులు పరిశీలించి, సంబంధిత శాఖలకు పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎస్సై మౌనిక



**పెద్దాపురం రూరల్,మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణం లో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రసిద్ది చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్దాపురం ఎస్సై వి.మౌనిక దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ పర్యవేక్షణలో వేదపండితులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి. శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, వరహాలు, లోవ, శివ తదితరులు ఉన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

## – ఇఇ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 33/11 కెవి పరిధిలో గల వార్షిక మరమ్మత్తులలో భాగంగా శనివారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు పట్టణ పరిధిలోని నవోదయ, ఎన్‌టిఆర్ ప్లాట్స్, రాజీవ్ కాలనీ, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు, దర్గా సెంటర్, మెయిన్‌రోడ్, మరిడమ్మ టెంపుల్ వీధి,తాడితోట ,పాతపెద్దాపురం, గౌరీ కోనేరు, వ్యాపార పుంత, ఆర్.బి.పట్నం రోడ్డు, సినిమాసెంటర్, మరియు శివాలయం వీధి ప్రాంతంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని,కావున విద్యుత్ వినియోగ దారులు సహకరించవలసినదిగా ఏపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్ తెలిపారు.